అమెరి'కులాసా' కథలు – వంగూరి చిట్టెన్‌రాజు





అమెరికులాసా కథ – 217

బహిమా మహిమ

ఈ బహిమా వగైరాలు ఏమిటా అని ఇప్పుడు మీరు ఆశ్చర్య పోయినట్టే ఆ మాట వినగానే పదిహేను రోజుల క్రితం నేను అంతకంటే మొహం అదోలా పెట్టినా, తీరా అక్కడికి వెళ్ళి నాలుగు రోజులు కులాసా చేసి వెనక్కి వచ్చాక భలే ఆనందంగానే ఉంది అని చెప్పక తప్పదు. ఈ బహిమా ప్రిన్స్ పె అనేది మెక్సికో దేశం లో కేన్ కూన్ అనే సముద్రతీరాన ఉన్న ఒకానొక అతి పెద్ద ..చాలా మందికి తెలిసిన రిసార్ట్...అని నాకు మా పిల్లలు చెప్పగా తెలిసింది. వాళ్ళందరూ కూడబలుక్కుని మా కుటుంబం అందరూ నాలుగు రోజులు అక్కడ మిగతా ప్రపంచం నుంచి దూరంగా పారిపోయి, ఈతి బాధలు మర్చిపోయి, సముద్రం లోకి చొచ్చుకు పోయి ములక్కుండా తేలిపోయి, మళ్ళీ ఇంటికి వచ్చేసి సంసార సాగరం లో ములిగిపోయే శలవుల ప్రక్రియ... కుటుంబం అందరం అంటే....నేనూ, మా సతీమణి, సుపుత్రుడు, ఇద్దరు అమ్మాయిలూ, అల్లుళ్ళూ, మా వియ్యంకుడు గారూ, వియ్యపురాలూ, వాళ్ళ అమ్మాయీ, అల్లుడూ...ఇలా

పెద్ద కుంకలం అంతా ఒక ఎత్తూ....పదేళ్ళ లోపు చిన్న కుంకలు... మా ఇద్దరు మనవలూ, ఇద్దరు మనవరాళ్ళూ మరొక ఎత్తూ.... ఇటు స్విమ్మింగ్ పూల్ నుంచి అటు ఆకుపచ్చ నీళ్ళ గల్ఫ్ ఆఫ్ డానల్డ్ ట్రంప్....(అబ్బే ఏదో సరదాకి...ఎందుకంటే నిన్న మొన్నటి దాకా గల్ఫ్ ఆఫ్ మెక్సికో అనే ఆ సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ అమెరికా అని ట్రంప్ గారు మార్చేశారు మరి). అదే కాక నల్ల నీళ్ళు ఉండే కెరీబియన్ సముద్రం లోనూ ఈత కొట్టడం వాళ్ళందరికీ సరదాయే....నేనూ



అప్పుడప్పుడు ములుగుతాను కానీ మా సతీమణి ఒడ్డున కూచుని నేనెక్కడ నిజంగానే ములుగుతానో అని మూలుగుతూ ఉంటుంది!.




మేము ఎవరి విమానాలలో వాళ్ళు హ్యూస్టన్, డాలస్ ల నుంచి సుమారు మూడు గంటల విమానం ప్రయాణం లో ముందు కేన్ కూన్ వెళ్ళి అక్కడ నుంచి 40 నిమిషాల సేపు పెద్ద వేన్ లో ప్రయాణం చేసి ఈ బహిమా ప్రాంతానికి చేరాం. అదంతా మన ఇండియాలాగానే ఉంది అని చెప్పడానికి చిన్న జోక్...మేము కారులో బయలు దేరిన పావు గంటకి మా మనవడు అవినాష్ "వెళ్ళాలి, వెళ్ళాలి" అని గొడవ మొదలుపెట్టాడు. మా అల్లుడు కారు డ్రైవర్ తో "ఎక్కడైనా టాయ్ లెట్స్ ఉండే చోటు ఆపు బాబూ" అనగానే ఆ డ్రైవర్ "యస్సార్" అనేసి రోడ్డు పక్కనే పొదల దగ్గర ఆపేసి "దిగండి" అన్నాడు. మేము ఆశ్చర్యపోతుంటే "మా దేశం అంతా టాయ్ లెట్లే...హి కెన్ డూ ఇట్ హియర్" అని స్పానిష్ భాషలో చెప్పాడు. నవ్వకండి.... అసలు జోక్ అది కాదు.. మా మనవడు కిందకి దిగి, కాస్త గింజుకున్నాడు కానీ ఆ లఘు శంక పని కానిచ్చేసి నన్ను చూసి "తాతా, ఐ జస్ట్ వాటర్డ్ ది ప్లాంట్స్" అన్నాడు. విషయం ఏమిటంటే..వాడు హ్యూస్టన్ లో ప్రతీ వారాంతం మా ఇంటికి వస్తాడు. అలా వచ్చినప్పుడల్లా మా తోటలో కుండీలకి, మొక్కలకి నాతో పాటు నీళ్ళు పొయ్యడం వాడికి మహా సరదా!. అదనమాట మెక్సికో లో వాడు మొక్కలకి నీళ్ళు పొయ్యడం అంటే!.

ఇక ఈ బహియా ప్రిన్స్ పె...హయట్ రీజెన్సీ వారి ప్రపంచవ్యాప్తంగా ఉన్న రిసార్ట్ వ్యాపారం..ట. ...ఇక్కడ సముద్ర తీరం లో కొన్ని వేల ఎకరాల అరణ్యం ,మధ్య ఐదారు లక్జరీ హొటెల్ సముదాయాలు, వందలాది స్విమ్మింగ్ పూల్స్, రెస్టారెంట్లు ..ఒకటేమిటి...ఉండవలసిన అన్ని హంగులూ ఉండనే ఉన్నాయి.. మేము ఉన్న హొటెల్ పేరు అకుమల్... ..ఇక్కడ మరొక జోక్ ఏమనగా...ఎందుకో తెలీదు కానీ మాకు ఇచ్చిన గది లోకి నేనూ, మా సతీమణీ, మా అబ్బాయీ పెట్టెలు సద్దుతూ ఉండగా...పక్క గదుల వాళ్ళు నలుగైదుగురు వచ్చి ముసి ముసి నవ్వులు నవ్వుతూ "కంగ్రాట్యులేషన్స్, గుడ్ లక్" లాంటివి చెప్పడం మొదలుపెట్టారు. మేము కొంచెం ఆశ్చర్య పోతుంటే.. మా సుపుత్రుడు ఆ గది గుమ్మం మీద ఉన్న పెద్ద రిబ్బన్ చూపించి నవ్వడం మొదలుపెట్టాడు. అది "హేపీ హనీమూన్"....అంటే ఆ గది హనీమూన్ దంపతులకి ఇస్తారుట.. మరి వాడు నవ్వాడు అంటే నవ్వడూ మరి?

ఇక మొదటి రోజు అసలు ఈ ప్రదేశంలో మనం చెయ్యగలిగే పనులు ఏమిటో అన్నీ బేరీజు వేసుకుని ప్లాన్ వేసుకోడానికి సరిపోయింది. నేను మైళ్ళ కొద్దీ నడవలేను కాబట్టి నాకు ఒక ఒక మోటర్ కారు లాంటిది ఇచ్చారు. ఇక్కడ

జత పరిచిన ఫొటోలు, వీడియోలలో మా వీర విహారాల విశేషాలు కనపడతాయి. ఒక యాట్...అంటే ఖరీదైన పడవ లో ముఫై మైళ్ళు



ఆకు పచ్చ సముద్రం లోంచి నలుపు నీళ్ళ సముద్రం లోకి చొచ్చుకు పోయి, అక్కడ ఆ లోతైన చోట నీటిలో తేలే పరికరాలు కట్టుకుని, జలకాలడడం బాగా చెప్పుకోదగ్గది. ఆ పడవ సరంగులు నలుగురు ..ఆ మాటకొస్తే ఎయిర్ పోర్ట్ లో దిగిన దగ్గరనుంచి మళ్ళీ వెళ్ళే దాకా ఆ మెక్సికన్ వాళ్ళు చూపించిన మర్యాద, నవ్వుతూ పలకరిస్తూ...మన వాళ్ళలాగా ఎక్కడ పడితే అక్కడ చెయ్యి చాపకుండా కావలసిన పనులన్నీ చేసి పెట్టడం భలే ముచ్చట వేసింది. కొస మెరుపుగా....ఆ పడవ నడిపిన ఒక సరంగుడు... ఎంత మంచివాడంటే....పడవ ఎక్కేటప్పుడు చాలా దూరం నడవడానికి నేను ఇబ్బంది పడడం గమనించి, దిగేటప్పుడు తనంతట తనే ఒక చక్రాల కుర్చీ పట్టుకొచ్చి నన్ను మా కారు దాకా కులాసాగా కబుర్లు చెప్తూ తోసుకుంటూ తీసుకెళ్ళాడు. కావాలంటే ఆ వీడియో పెట్టాను చూడండి...

మరొక మంచి అనుభూతి మాజిక్ షో...రెండు గంటల సేపు జరిగిన ఆ ఆద్భుతమైన మేజిక్ షో ని మా మనవరాళ్ళు మొదటి వరసలో కూచుని చాలా ఆనందించారు. ఆ మాంత్రికుడితో వాళ్ళకి ఫొటో తీసి నేను ఇంకా ఆనందించాను. ఎలాగా మెక్సికో వెళ్ళాం కాబట్టి మా అబ్బాయి, అమ్మాయి నాకు ఒక మెక్సికన్ టోపీ "కొని" పెట్టారు...కానీ టోపీ పెట్ట లేదు!. ఇక బీచ్ లో తెల్ల బట్టలతో ఫొటోలు మరొక తమాషా....ఇలా మూడు రోజుల శలవులు మధురానుభూతులతో..మొత్తం కుటుంబంతో గడిపే అవకాశం వచ్చింది.,,,కొన్ని ఫొటోలు, వీడియోలు జత పరిచాను..మీ కోసం...

COMMENTS